తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

శుక్రవారం

1 ఆగస్టు 2025

పేజీలు : 10




బిసి గురుకుల విద్యార్థుల

# ఆందోళనపై కలెక్టర్ స్పందన

## సమస్యల పరిష్కారానికి అధికారులకు కఠిన ఆదేశాలు



**గద్వాల నడిగడ్డ, మానవపాడు, జూలై 31 (జనం సాక్షి)**

విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాలపై కఠిన చర్యలు తీసుకున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబా పూలే బి.సి. బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల కొరతపై రోడ్డెక్కి ఆందోళనకు దిగిన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ పాఠశాలను స్వయంగా సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను విని, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఏదైనా సమస్యను చట్టబద్ధంగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, మీ భద్రత మాకు అత్యంత ప్రాధాన్యమైనదిగా భావిస్తున్నామని,రోడ్డెక్కే ప్రయత్నాలు ప్రమాదాలకు దారితీయే అవకాశముండటంతో అలాంటి పరిస్థితి మళ్లీ ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకూడదని అన్నారు. పాఠశాలలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్ రజిత, సూపర్వైజర్ నవీన్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, వార్డెన్, హౌస్‌మాస్టర్‌లపై మెమో జారీ చేసినట్లు తెలిపారు.విద్యార్థులపై బెదిరింపులకు పెడుతున్న పాఠశాల భవనాన యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నాలుగు మరుగుదొడ్లను ఉపయోగించుకొనాలని, నెల రోజులలో అందరికీ సరిపడేలా కొత్త మరుగుదొడ్లు, బాత్రూంలను నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం న్యాయమైన పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలన్నారు.

# శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న మంత్రి జూపల్లి



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జులై 31 (జనంసాక్షి):** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీశైల క్షేత్రంలోని తాండ్ర పాపారాయ వెలమ చౌల్ట్రీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కుర్మయ్యగారి శాంతమ్మ - నారాయణ రావు భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని, ఎవరు ఎక్కడ ఉన్నా సమాజహితం కోసం పాటుపడాలని అన్నారు. కార్యవర్గ సభ్యులు ఒక కుటుంబంగా శ్రీశైలంలో వసతి గృహం నిర్మించు కోవడం సంతోషకరం,





అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన పులువురు ప్రజాప్రతినిధులు , ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ ప్రెసిడెంట్ క్రిష్ణమనేని పాపారావు, వైస్ ప్రెసిడెంట్ తాండ్ర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి



**డాక్టర్ రోగులకు వ్రాసే మందుల చీటీలు అర్థమయ్యే విధంగా ఉండాలి**

**ఆసుపత్రిలో మందుల కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**

**కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ**

**జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్యా**

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 31 (జనం సాక్షి)**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందు బాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీ ణ్య సూచించారు. గురువారం కంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆస్పత్రిలో తిరుగుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా ? అందరూ విధులకు హాజరయ్యారా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని *మిగతా 4లో..*

# మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి



**కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట బ్యూరో జూలై 31 (జనంసాక్షి)**

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె.హైమావతి. మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించి విద్యార్థులకు మధ్యాహ్న *మిగతా 5లో..*

# ఇందిరమ్మ ఇంటి తొలి గృహప్రవేశం

**హాజరైన ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**దంపతులకు నూతన వస్త్రాలు అందించి అభినందించిన ఎమ్మెల్యే**

**ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరిన సొంత ఇంటి కల**

**ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు**

**ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరింది**



**వనపర్తి బ్యూరో జూలై 30 జనంసాక్షి**

ఎన్నో ఏళ్లుగా సొంతింటి నిర్మాణం కోసం కళ్ళు గన్న కుటుంబాలు నేడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలతో వారి సొంతింటి కలలను నెరవేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మేఘా రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వనపర్తి నియోజకవర్గం ఏదుల మండలం చీర్కపల్లి గాంధీ నగర్ కాలనీలో దేవరీ రేణుక స్వామి నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి బుధవారం వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గృహ నిర్మాణం చేసుకున్న కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంలో ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు, అనుభవించారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి *మిగతా 4లో..*



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

**మక్తల్, జూలై 31 (జనంసాక్షి)**

లయన్స్ క్లబ్ మక్తల్ బీమా ఆధ్వర్యంలో పట్టణంలోని ఎల్లమ్మ కుంట జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధ్యక్షుడు సత్యాంజనేయులు తెలిపారు. ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ లయన్ మణికంఠ గౌడ్, కో చైర్మన్లు లయన్ డాక్టర్ రాజేష్ గౌడ్, లయన్ డాక్టర్ అశోక్.. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించి తగు జాగ్రత్తలు వివరించారు. అనంతరం వైద్య శిబిరంకు సహకరించిన డాక్టర్ తిరుపతి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌లను శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ రేవతి లయన్స్ క్లబ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి ఆడెం సత్యనారాయణ, జోన్ చైర్మన్ సూగురు జైపాల్ రెడ్డి, డాక్టర్ శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ మామిళ్ల పృథ్వీరాజ్, సీనియర్ సభ్యులు కర్ని స్వామి, గవినోళ్ల జైపాల్ రెడ్డి, ఆంబాదాస్, రఘు ప్రసన్న భట్, కట్టా వెంకటేష్, కొండా విజయ్, శరణప్ప, వాకిటి రమేష్, భార్గవ్ రాణా, హెల్త్ సూపర్ వైజర్ నిహారిక, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్రోహులను శిక్షించాలని యస్ఐకి వినతి



**మక్తల్, జూలై 31 (జనంసాక్షి)**

విద్రోహులను శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో యస్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట పట్టణంలో గణేష్ విగ్రహాలను తయారు చేస్తున్న చోటే కొందరు హిందూధర్మ విద్వేషులు ధ్వంసం చేశారు. గణేష్ ఉత్సవాలు సమీపిస్తున్న సమయంలో కల్లోలాలు సృష్టించడం కోసం హిందూ ధర్మంపై ద్వేషంతో గణేష్ విగ్రహాలపై రాళ్లు విసరడం, విగ్రహాలను ధ్వంసం చేయడం ప్రతి సంవత్సరం జరుగుతుంది. గత సంవత్సరం మక్తల్‌లో ఈసారి నారాయణపేటలో కావున అట్టి విద్రోహులను తక్షణమే గుర్తించి శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు కే సత్యనారాయణ గౌడ్, పట్టణ గౌరవ అధ్యక్షులు తోక హనుమంతు, కార్యదర్శి మల్లికార్జున్, బజరంగ్ దళ్ నారాయణపేట జిల్లా సాహ సంయోజక్ భీమేష్, ప్రఖండ సంయోజాక్ రాహుల్, మూర్తి, రామాంజనేయులు, నాగరాజు, రాము, అక్షయ్, శివ, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

## డే స్కాలర్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**

నారాయణపేట జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన బాల బాలికల నుండి 2025 - 26 విద్యా సం.నకు హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట్, రామంతాపూర్‌లో 1వ తరగతిలో (డే స్కాలర్) ప్రవేశముల కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ తెలిపారు. ఈ దరఖా స్తులన ఆగస్ట్ 8 తేదీలోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం రూము నంబర్. 123, మొదటి అంతస్తు జిల్లా కలెక్టర్ కార్యాలయముల సముదాయము పాలకొండ, మహబూబ్ నగర్‌లో పూర్తిచేసిన దరఖాస్తులను సమర్పించవలేనని తెలిపారు. ఈ నెల 1 నుండి దరఖాస్తులను ఉచితముగా పొందవచ్చునని తెలిపారు. జిల్లా స్థాయిలో వచ్చిన దరఖాస్తులను ఆగస్ట్13న నాడ లాటరీ పద్ధతి ద్వారా 6గురుని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి ఎంపికకు పంపబడు ననీ తెలిపారు. దరఖాస్తు చేసుకొను బాల బాలికలు తేదీ.01.06.2018 నుండి 31. 05.2019 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులు అని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1,50,000 గ్రామీణ ప్రాంత, 2,00, 000 పట్టణ ప్రాంతం వారికి ఉం డవలెను. కుల, నివాస, ఆదాయ, ధృవీకరణ పత్రము లు తహసీల్దార్ / మీ సేవ ద్వారా పొందిన వాటిని జిరాక్సు ప్రతులను దరఖాస్తునకు జతపరచి సమర్పించాలని తెలిపారు.

# తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యులుగా జిల్లా వాసి ముచ్చర్ల దినకర్ రావు

**నాగర్ కర్నూల్ ఆర్సీ, జూలై 31(జనంసాక్షి):**



తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యులుగా నాగర్ కర్నూల్ జిల్లా వాసి సీనియర్ పాత్రికేయులు, వెన్నెల, కంజీర సాహిత్య అకాడమీ అధ్యక్షులు, నంది అవార్డు గ్రహీత ముచ్చర్ల దినకర్ రావుకు భాషా సంస్కృతిక శాఖ సలహాదారు కమిటీ సభ్యులుగా చోటు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక దురాచారాలు, చెడు అంశాలపై చర్చించడానికి, సంస్కృతి, కళ, సాహి త్యం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వాటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించడానికి కమిటీ చైర్మన్ కోదండరామ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పనిచేయనున్నారు. ప్రభుత్వం ఇరవై (20) మంది పండితులు, ప్రముఖ కళాకారులు మరియు సాహిత్య ప్రముఖులతో ఒక సలహా కమిటీని ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ముచ్చర్ల దినకర్ రావుకు చోటు కల్పించడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముచ్చర్ల దినకర్ రావు, మీడియా అక్రిడిటేషన్ జిల్లా కమిటి సభ్యులుగా పనిచేశారు. ఆయన1997 నుండి నాగర్ కర్నూల్ పట్టణంలో ఆంధ్రభూమి, సమస్తే తెలంగాణతో పాటు పలు పత్రికల్లో పనిచేస్తూనే స్థానిక చరిత్ర, సంస్కృతి తెలంగాణ సంప్రదాయాలను వర్తమాన సమాజానికి అందించే ప్రయత్నంలో భాగంగా ప్రప్రథమంగా కవితాకళానిధి శ్రీకపిలవాయి లింగమూర్తి జీవనచిత్రం రూపొందించి 03.05.2012న రవీంద్ర భారతిలో ఆవిష్కరించారు. ఈ డాక్యుమెంటరికి 2011 సంవత్సరానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ ద్వితీయ నంది ఆవార్డు దక్కింది. 2018లో పెబ్బేరు వాస్తవ్యులైన డా. శ్రీ నారాయణ రెడ్డి సమకాలీకులు డా.వల్లపురెడ్డి బుచ్చారెడ్డి మీద వారి సంపద్వంతమైన తెలుగు భాషా సాహిత్యాన్ని తెలియచెప్పేందుకు డాక్యుమెంటరి రూపొందించి సాహితి రంగంలో వారి కృషిని భవిష్యత్ తరాల కోసం భద్రపరిచి, అలాగే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా 100 సం.ల చరిత్రను భవిషత్తు తరానికి తెలపడం కోసం జిల్లా అంతా దాదాపు వేల కిలో మీటర్లు ప్రయాణం చేసి పాలమూరు దర్శనం పేరిట వీడియో డాక్యుమెంటరీని రూపొందించారు. అలాగే వెన్నెల సాహిత్య అకాడమి, తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో వరుసగా దాదాపు 14 పుస్తకాలు ప్రచురించి, 3 డాక్యుమెంటరీలతో పాటు అడియో క్యాసెట్ రూపొందించి, వివిధ అంశాలపై అనుభవం కలిగిన నాగర్ కర్నూల్ జిల్లా వాసి అయిన ముచ్చర్ల దినకర్ రావుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా సంస్కృతి శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా చోటు కల్పించడంతో నాగర్ కర్నూల్ జిల్లా కవులు కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రేమ్ చంద్ జీవితం అందరికీ ఆదర్శం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** హిందీ జాతీయ కవి ప్రేమ చంద్ జయంతి సందర్భంగా శ్రీ సాయి స్కూల్‌లో వారి చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు శేషమ్మ మాట్లాడుతూ విద్యార్థులు, ప్రతి ఒక్కరూ ఆదర్శం తీసుకోవాల్సిన గొప్ప వ్యక్తి ప్రేమ చంద్ అని అన్నారు. వీరు బాల్యం నుంచే అనేక బాధలు,కష్టాలు అనుభవించి జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగారు అని తెలిపారు. పాఠశాలలో చదువుకొ నే రోజుల్లో తోటి విద్యార్థులకు చదువు చెపుతూ ఉన్నత విద్యను అభ్యసించి. ఉద్యోగం చేస్తూ అనేక డిగ్రీలు పొందారని అన్నారు. సమాజంలోని పేదరికం, సామాజిక అసమానతలు, వంటి అంశాలపై రచనలు చేసి అనేక మార్పులు తీసుకొని వచ్చారని, దేశ స్వాతంత్ర్యం ఉద్యమం లో పాల్గొని అనేక సార్లు జైలుకు వెళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ బాలప్ప, అమీనా, హెచ్.నర్సింహా, మనీలా, రాజశ్రీ,లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## చెకప్ కోసం వెళితే ప్రాణం తీశారు

**అచ్చంపేట రూరల్ జూలై 31 (జనం సాక్షి)**



పట్టణంలోని ఎంఎంఆర్ హాస్పిటల్‌లో చింతల శ్రావణికి డెలివరీ టైంకు సమీపంలో ఉన్నందున హాస్పిటల్‌కి వచ్చి డెలివరీ టైం కోసం చెకప్ చేయించుకున్నారు. చెకప్ తర్వాత డాక్టరు రామకృష్ణ శ్రావణి కుటుంబ సభ్యులతో ఆపరేషన్ చేయాలన్నారు ఎందుకంటే కడుపులో ఉన్న బిడ్డ ఉమ్మనీరు మింగింది కనుక డెలివరీ టైం ఆగస్టు 13వ తారీకు వరకు ఉంది. అత్యవసరంగా ఈ రోజే ఆపరేషన్‌చేయవలసిన అవసరం ఉంది. లేదంటే తల్లి బిడ్డ ప్రాణాలకు ప్రమాదము ఉందని చెప్పారు. డాక్టర్ సలహా మేరకు కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేయండి అని డాక్టర్ రామకృష్ణను కోరారు. ఈ విధంగానే బుధవారం సాయంత్రం 6:15 నిమిషాలకు ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత శ్రావణి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత ఆమెను ఆపరేషన్ థియేటర్ నుండిబెడ్ పైకి తీసుకువచ్చారు. అనంతరం శ్రావణికి రక్తస్రావం ఎక్కువగా రక్తస్రావంతో తడిసి ముద్దయింది. కుటుంబ సభ్యులు డాక్టర్ సిబ్బంది అందరు గమనించి నాగర్ కర్నూల్ నుంచి రక్తాన్ని తెచ్చి ఎక్కించిన కూడా, శ్రావణి పరిస్థితి విషమంగా మారింది. డాక్టర్ రామకృష్ణ హుటాహుటిన హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తరలించగా, అక్కడ ఉన్న డాక్టర్ల సిబ్బంది శ్రావణి ఆరోగ్యం మెరుగుపడుతుందని హామీ ఇవ్వలేదు కానీ వారి బాధ్యతగా చికిత్స చేస్తామని అన్నారు. వారు చికిత్స చేస్తుండగానే శ్రావణి మరణించారు. అనంతరం అక్కడి నుండి తిరిగి మళ్లీ అచ్చంపేటలోనే ఎంఎంఆర్ హాస్పిటల్‌కు మృతదేహాన్ని తీసుకువచ్చి హాస్పిటల్ ముందు ధర్నా చేశారు, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని ఆ ధర్నాను పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడి చనిపోయిన శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని, పోలీసు సిబ్బంది, అచ్చంపేట ఎస్సై విజయ్ భాస్కర్ ఇతర మండలాల ఎస్సైలు సూచించారు. ఈ మేరకు హాస్పిటల్స్ సిబ్బంది కుటుంబ సభ్యులు మాట్లాడుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తర్వాత తమ గ్రామానికి తీసుకెళ్తామని కుటుంబ సభ్యులు పెద్ద మనుషులు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొని సమస్యను పరిష్కరించామని తెలిపారు.

## రైతుల క్షేమం కోరి ఇసుక రవాణా ఆపండి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం



**మాగనూర్ (జనం సాక్షి):**

రైతుల క్షేమం వ్యవసాయం దుర్భిక్షం కాకుండా వెంటనే మాగనూర్ పెద్ద వాగు నుంచి ఇసుక రవాణా ను వెంటనే ఆపాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అధికారులను కోరారు. గురువారం మాగనూర్ పెద్ద వాగును రైతులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వాగు నుంచి ఇసుక రవాణా చేస్తే రానున్న రోజుల్లో మాగనూర్ లో వ్యవసాయ రంగానికి సాగు నీరు దొరక్క రైతులు వ్యవసాయం మానుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు వాగు పరివాహక ప్రాంతాల్లో బోరు బావుల ఆధారంగా వ్యవసాయం చేసుకుంటున్నారని ఇసుక తరలిస్తే బోర్లు ఇంకిపోయి పంటలకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. రైతులు ప్రజల భవిష్యత్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఇసుక రవాణా ఆపాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

**కెనాల్‌ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే**

కుడి కాల్వ నుంచి పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయాలని సంగంబండ ప్రాజెక్టు నుంచి వ్యవసాయానికి పూర్తి స్థాయిలో నీరు అందించాలని చిట్టెం రామ్మోహన్ రెడ్డి అధికారులను కోరారు. పార్టీ కార్యకర్తలతో కలిసి కుడి కాల్వను సందర్శించారు. కుడి కాలువ ముళ్ళ పొదలతో నిండి పోయిందని దాంతో రైతులకు అవసరమైన నీరు అందడం లేదని అన్నారు. పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి ఎల్లారెడ్డి మల్లారెడ్డి సుదర్శన్ గౌడ్ అశోక్ గౌడ్ పూల రాము పల్లె మారెప్ప డిజిల్ సాయి బన్న బస్వంత్ రెడ్డి ఈశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



– లీగల్ సర్వీస్ కార్యదర్శి వింధ్య నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ర్యాగింగ్‌కు పాల్పడితే 6 నెలల జైలు శిక్ష పడుతుందని లీగల్ సర్వీసెస్ కార్యదర్శి సీనియర్ జడ్జి వింధ్యానాయక్ తెలిపారు. గురువారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ అధ్యక్షతన నారాయణపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్ ముప్పు నివారణ గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడుతూ ర్యాగింగ్ ముప్పు నివారణ గురించి విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహనా కల్పించారు. ర్యాగింగ్ చేసిన లేదా చేసేవారికి సహకరించిన ఇద్దరికి సమాన శిక్ష ఉంటుంది అన్ని తెలిపారు. ర్యాగింగ్ అనగా కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు కొత్తగా వచ్చిన విద్యార్థులకు మనస్తాపం కలిగించే రీతిలో ప్రవర్తించడం బాల్య వివాహాలు, మానసికంగా, శారీరకంగా మాటలతో హింసించడం, విద్యార్థినీ, విద్యార్థులను పీడించడం, కలవరపెట్టడం, అవమాన పరచడం వంటివి నేరంగా పరిగణించి ఆరునెలల జైలు శిక్ష లేదా వేయి రూపాయల జరిమానా విధించవచ్చునని అన్నారు. ర్యాగింగ్ కారణంగా ఆపదలో ఉన్న విద్యార్థులకు సహాయం చేయడానికి భారత దేశం యొక్క నేషనల్ యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్ జూన్ 2009లో పని చేయడం ప్రారంభించిందన్నారు. టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ (1800-180-5522)కి సంప్రదించాలి అని తెలిపారు. విద్యార్థులు చిన్న చిన్న గొడవలకు దూరంగా ఉండాలి అన్నారు. దాడి చేయడం, నేర పూరితమైన శక్తిని ప్రదర్శించి తోటి విద్యార్థులను భయపెట్టడం మొదలగునవి ర్యాగింగ్గా భావించ వచ్చునని చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు పైగా గవర్నమెంట్ ఉద్యోగాలకు అనర్హులు అన్నారు. సైబర్ నేరాలు, హెల్ప్ లైన్, టోల్ ఫ్రీ నంబర్స్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. న్యాయ వ్యవస్థలో ఉచిత న్యాయ సలహాలు ఇచ్చేందుకు లీగల్ డిఫెన్స్ సిస్టం ఉందని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మూడు లక్షలలోపు సంవత్సరాల ఆదాయం కలిగిన బీసీలకు ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. న్యాయ సలహాల కోసం 15100 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యను చెప్తే పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ నాగేశ్వరి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీనియర్ న్యాయ వాది నందు నామాజీ అడ్వకేట్ క్రాంతి,కళాశాల ప్రిన్సిపాల్, జగదీశ్వర్, ఉపాధ్యాయులు, ఆంజనేయులు పోలీస్ అధికారి పారాలీగల్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి
- పోలీసు, రెవిన్యూ అధికారులు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెవిన్యూ పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా నారాయణ పేట జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేదని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమాన తలను అంతరానితనాన్ని, కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడి పించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని అన్ని కులాలకు చెందిన వారిని గ్రామాలలో సమావేశం నిర్వహించి చట్టాలను అమలు చేయు



విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురా వడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైత న్యం ఉంటుందని అన్నారు. పౌర హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూ వివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు. కులం పేరుతో ఎవ్వరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమ తాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్యంగా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
- ఆర్ఐ బాల్ రాజ్

**మాగనూరు (జనం సాక్షి)**
చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని మాగనూరు మండల రెవెన్యూ అధికారి బాల్ రాజు అన్నారు. ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే)ను గురువారం మండలంలోని వడ్వట్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీస్ అధికారులు మాట్లాడుతూ గతంలో కుల వివక్ష ఉండేదని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని, కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మిడ్జిల్ మండలంలో కలెక్టర్ అకస్మిక తనిఖీ

**మిడ్జిల్ జులై 31 (జనం సాక్షి)**
మిడ్జిల్ మండల కేంద్రంలో మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలో కస్మిక తనిఖీ నిర్వహించి కస్తూరిబా గాంధీ పాఠశాలను పరిశీలించి వర్షపు నీరు నిలవడంతో కలుగుతున్న ఇబ్బందులను గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టి ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా చెయ్యాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలో సిసి నిర్మాణం, అదనపు గదులు, సీసీ కెమెరాల ఏర్పాటు, కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచడానికి కావలసిన నిధుల అంచనా వ్యాయాన్ని అధికారులు సిద్ధం చేసి అందిస్తే కావలసిన నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడుతున్న మేస్త్రీలు అధిక డబ్బులు తీసుకుంటున్నారని తెలపడంతో



లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని, మండలంలో ఇంటి నిర్మాణ ధరల నిర్ణయ కమిటీ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణను పరిశీలించి పారిశుద్ధం సక్రమంగా లేదని ఎంపీడీవో, స్థానిక పంచాయతీ కార్యదర్శి పై నా అసహనం వ్యక్తం చేశారు. కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు నిధులను అందిస్తామన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పలు రకాల సూచనలతో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించాడు. మండలంలోని ప్రజలకు నిరంతరం వైద్య ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, నాయకులు గౌస్, వెంకటయ్య, తిరుపతి, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి శిబిరంలో 24 మందికి కంటి ఆపరేషన్లు



– ఆప్తాలమిక్ అధికారి కోట్ర బాలాజీ

**నాగర్ కర్నూల్ ఆర్సీ, జూలై 31(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నాడు నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరంలో 24 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 68 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో అవసరమైన వారికి, అత్యవసరం ఉన్నటువంటి క్యాట్రాక్ట్ పొర గుర్తించిన 24 మందికి ప్రత్యేక అంబులెన్స్‌లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. లైన్స్ క్లబ్ ఆఫ్ నాగర్ కర్నూల్ అధ్యక్ష కార్యదర్శులు సురేష్, నరేందర్ రెడ్డి రోగులకు సహకరించి పండ్లు, బిస్కెట్లునీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్ శ్రీనివాసులు, ప్రేమ్ కుమార్ రెడ్డి లయన్ తేప్ప శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య సిబ్బంది వివిధ గ్రామాల రోగులు పాల్గొన్నారు.

## పాదయాత్ర విజయవంతం చేయాలి

కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహులు

**రాయికోడు,జూలై 31,(జనం సాక్షి)**
రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాదయాత్రను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు స్పష్టం చేశారు. ఆగస్టు 1న సాయంత్రం 5 గంటలకు సంగుపేట నుండి జోగిపేట్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ల తోపాటు పలువురు కాంగ్రెస్ జాతీయ,రాష్ట్ర నాయకులు పాల్గొననున్నట్లు చెప్పారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాయికో చౌరస్తా నుండి మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి నాలుగు గంటల లోపు సంగుపేట చౌరస్తాకు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి

రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వే, నివేదికల రిజిస్టర్లను తనిఖీ చేశారు . ఆసుపత్రిలో రోజూ వచ్చే ఓపి పేషెంట్ల సంఖ్య, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వివరాల ను కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన రోగులకు అందు బాటులో ఉండాలని తెలిపారు. రోగులకు ఇచ్చే మందుల చీటీలను అర్థమయ్యే విదంగా వ్రాయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న బెడ్ల సంఖ్య, నెలవారీగా జరిగే డెలివరీల గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. ఆసు పత్రిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, మందుల కొరత లేకుండా ముం దుగానే సరఫరా చేసుకోవాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి, అవసరమైన సమయంలో చికిత్స అందించాలని స్పష్టంగా తెలిపారు. తనిఖీల సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో కూడా కలెక్టర్ మాట్లా డారు. వారికి అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మంచి వైద్యం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం నిబద్దతతో పనిచేయాలని ఆమె తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి తొలి గృహప్రవేశం



ఐదు లక్షల రూపాయల ఖర్చుతో సొంతింటి కల సహకారం చేస్తుందని తెలిపారు.వనపర్తి నియోజకవర్గ మొత్తంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం అవుతున్నాయని మరో 2000 ఇండ్లను అదనంగా మంజూరు చేయించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేయిస్తామన్నారు. ఈ మూడేళ్ల కాలంలో నియోజకవర్గంలో పూరిగుడిసె, రేకుల ఇల్లు, పాత మట్టి మిద్దెలు లాంటివి లేకుండా అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి ఇంటి ఇబ్బందులు తొలగించి సొంత ఇంటి కల నెరవేరుస్తామన్నారు.గోపాల్పేట ఉమ్మడి మండలం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సత్యశీలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రఘు యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కొంకి వెంకటేష్, రేవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జమ్మి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందెం సుఖేందర్ రెడ్డి, సురేష్ గౌడ్, బాలస్వామి, చీర్కపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరశురాములు, వెంకటస్వామి, రవి, కాశీం, రామకృష్ణ, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భవిత కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**

వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి 8 లక్షల వ్యయం తో చేపట్టనున్న భవిత కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంబంధించిన విద్యార్థులకు వారికి అనుగుణంగా విద్యా బోధన అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని, బుద్ధి వైకల్యం కలిగిన ప్రతి ఒక్కరూ ఇక్కడ అందించే అధునాతన విద్యను సద్వినియోగం చేసుకోవాలనీ, సూచించారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తయారు చేయడానికి నూతన వంటగది నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ, రఘు ప్రసాద్, గ్రామ నాయకులు శ్రీశైలం, చందు విద్యాశాఖ అధికారులు మహానంది ఎంఈఓ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**

పెద్దమందడి మండలం చిన్న మందడి గ్రామానికి చెందిన పద్మమ్మ, శాంతమ్మకు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతున్నాయని మంజూరైన ఇండ్లను సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశాలకు వచ్చి నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేస్తారని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సరైన పద్ధతిలో మందులతో అధిక దిగుబడి

## ఏడిఏ నూతన్ కుమార్



**నారాయణఖేడ్ జులై 31 (జనం సాక్షి)**
సరైన పద్ధతిలో మందులతో అధిక దిగుబడి సాధించొచ్చునని ఏడిఏ నూతన్ కుమార్ అన్నారు. నారాయణఖేడ్ మండలం చాప్టా కే గ్రామంలో నారాయణఖేడ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నూతన్ కుమార్ గురువారం పత్తి పంటను సందర్శించి రైతులకు ప్రస్తుతం పంటపై అవగాహన కల్పించారు. ప్రధానంగా కలుపు నివారణ దశలవారీగా చేపట్టినట్లయితే దిగుబడి అధికంగా రావడం జరుగుతుంది మొక్క ఎదుగుదలకు తోడ్పడుతుందని, ప్రధానంగా మందులు ఉదయం వేళలో గాని సాయంత్రం వేళలో కానీ పిచికారీ చెయ్యాలన్నారు. ప్రధానంగా పత్తి పంటలో 60 రోజుల వరకు కలుపు నివారణ తప్పనిసరిగా చేసుకొనవలెనని,పత్తి పంటలో రెండు నుంచి నాలుగు ఆకుల దశలో మాత్రమే కలుపు నివారణ చర్యలు చేపట్టవలెనని, 15 మంచి 45 రోజుల వరకు చాలా జాగ్రత్తగా కలుపు నివారణ చేపట్టాలని అన్నారు. పత్తి పంటలో ప్రస్తుతం 45 రోజుల నుండి 60 రోజుల దశలో ఉన్నది పత్తి పంటలో రసం పీల్చే పురుగులు అనగా పేనుబంక తెల్ల దోమ పచ్చ దోమ పిండి నల్లి ఆశించడం జరిగిందని అన్నారు. దీని నివారణకు పసుపు రంగు కానీ నీలిరంగు కానీ జిగురు అట్టలు ఎకరానికి 10 నుంచి 12 పంటలో అక్కడక్కడ తప్పనిసరిగా పెట్టవలెను అదేవిధంగా ప్రాథమిక దశలో ఆశించినట్లయితే వేప నూనె 5 మిల్లీమీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి గుడ్డు దశలో పిచికారి చేసుకొనవలెను అదేవిధంగా ఈ రసం పీల్చే పురుగుల వలన దిగుబడి తగ్గటం జరుగుతుంది అందుకోసం రైతులు రసం పీల్చే పురుగులను నివారణ చేసుకొనడం తప్పనిసరి దేనికి ప్రధానంగా పురుగుమందులు అనగా ఎసిటమైప్రిడ్ మందును కానీ తయోమితాబ్జామ్ మందును గాని ఫిప్రోనిల్ మందును కానీ డై ఫెంతురన్ మందును గాని పిచికారి చేసుకున్నట్లయితే ఈ రసం పీల్చే పురుగుల ఉధృతి నుండి పంటను కాపాడుకోవచ్చు అన్నారు.

# ఖబర్దార్ కాంగ్రెస్ నాయకుల్లారా..

**90శాతం రుణమాఫీ ఏ గ్రామంలో అయ్యిందో చూపిస్తారా ?**

**ఉచిత గ్యాస్,మహిళకు 2500 గృహ జ్యోతి ఎక్కడ?**

**దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు సిద్ధంగా ఉండాలి**

**మండల అధ్యక్షులు అశోక్ రెడ్డి**



**చిలప్ చేడ్, జులై 31, జనంసాక్షి :**
కొత్తగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా మొన్న జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి మేము మీరు అందరం కలిసి పాలాభిషేకం చేద్దాము అన్ని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అనడంతో జీర్ణించుకోలేక పోయి న కాంగ్రెస్ నాయకులు మీరా ప్రెస్మీట్ పెట్టింది ఖబర్దార్ బిఆర్ఎస్ పార్టీ నాయకులము సహన ంతో ఊరుకుంటున్నాం కాబట్టి విచ్చలవిడిగా మాట్లాడుతున్నారు మా అధిష్టానం,ఎమ్మెల్యే ఆదేశిస్తే మీరు ఎక్కడ కూడా తిరగలేరని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అశోక్ రెడ్డి అన్నారు. కలెక్టర్ వంద శాతం అభివృద్ధి పథకాలు ప్రజలకు అందాయని అనడం కరెక్టు కాదని ఆయన ఒక జిల్లా ఉన్నత అధికారి అయ్యుండి ఒక పార్టీ నాయకుడిగా మాట్లాడడం సరికాదు ముఖ్యంగా ప్రజా కార్యక్రమాల్లో కలెక్టర్ ప్రభుత్వం చేపట్టేటటువంటి పథకాల గురించి వివరించడం సరైనది కాదు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ప్రజా సభలలో ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయడం సరికాదు మండలంలో కుంటుపడిన అభివృద్ధి పథకాలపై ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారైన కలెక్టర్‌కి వివరి స్తుంటే మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు రుణమాఫీ వంద శాతం జరిగిందని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బెస్త లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యులు షఫీ, పార్టీ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,సీనియర్ నాయకులు రాజిరెడ్డి,సయ్యద్ హుస్సేన్, తాజా మాజీ సర్పంచులు గోపాల్ రెడ్డి,ఇస్తారి,యాదగిరి, శంకర్ నాయక్,బిక్షపతి నాయక్, పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలుస శంకర్ గౌడ్‌ని సన్మానించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి బ్యూరో జులై 31జనంసాక్షి :** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామంలో ప్రభుత్వ హై స్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తూ గురువారం నాడు పదవీ విరమణ పొందిన పలుస శంకర్ గౌడ్‌ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సన్మాని ంచారు.

ఈ సందర్భంగా చిన్నా రెడ్డి మాట్లాడుతూ అన్ని ఉద్యోగాల కెల్లా ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని అన్నారు. నేటి బాలలను అక్షరాసులుగా తీర్చిదిద్ది సమాజంలో వివిధ ఉద్యోగాలలో స్థిరపడటానికి సరైన ఉపాధ్యాయుడే కారణం అవుతారు కావున విద్యార్థులు ఉపాధ్యా యులను గౌర వించాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి లో పలుస శంకర్ గౌడ్ క్రమశిక్షణతో, స్నేహ పూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొం దిరని, పదవి విరమణ అనేది అనివార్యమని ప్రతి ఒక్కరూ పదవి విరమణ పొందవలసి వస్తుందని తెలిపారు. పలుస శంకర్ గౌడ్ భావి జీవితం సుఖ శాంతులతో ఆయురారో గ్యాలతో ఉండాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు. వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, రామ్ జీ నాయక్, భాస్కర్ ,పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు పాల్గొన్నారు.

# అధికారులు వార్డులలో పర్యటించాలి

**మున్సిపల్ చైర్మన్ కడవెరుగు మంజుల రాజనర్సు**





**సిద్దిపేట బ్యూరో, జూలై 31 (జనంసాక్షి)**
సిద్దిపేట పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు తో కలిసి సాధారణ సమావేశాన్ని నిర్వహించిన మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ఈసందర్భంగామొదట ఎజెండాలో పొందుపరచినటువంటి 30 అంశాలను మేనేజర్ శ్రీనివాస్ చదివి వినిపించగా పాలకవర్గం సభ్యులు ఎజెండా అంశాలకు తమ ఆమోదాన్ని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని వార్డులలో వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉంటుందని చైర్పర్సన్ దృష్టికి తీసుకరాగా వెంటనే మున్సిపల్ డి.ఈ, ఏ.ఈ లు పట్టణంలోని ప్రతి వార్డులో పర్యటించి అవసరమగు చోట వెంటనే మొరం పోసి చదును చేపించాలని, అన్ని వార్డులలో పెండింగ్ పనులపై ఒక నివేదిక తయారుచేసి అందించాలని ఆదేశించారు. వర్షాకాలం కావున వార్డు ఆఫీసర్లందరూ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండాలని అన్నారు.సిద్దిపేట పట్టణ పారిశుధ్య నిర్వహణపై అధికారులపై మండిపడ్డ మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు పట్టణంలో బ్లాక్ స్పాట్స్ రోజురోజుకు పెరిగిపోతున్నాయని పట్టణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం కావున ప్రజలు కూడా తమ చుట్టూ ఉండే పరిసర ప్రాంతాల్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.ఇండ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. పట్టణంలో దోమల పిచికారీ ప్రతిరోజు నిర్వహించాలని, ప్రజలందరూ చెత్తను మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని పట్టణ కౌన్సిలర్లు అన్నారు. నిధులు లేక పట్టణంలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కృషి, సహకారంతోనే సిద్దిపేట పట్టణం ఇంతలా అభివృద్ధి చెందిదని తెలిపారు. సిద్దిపేట పట్టణ గణపతి కుంటలోని మట్టిని తరలించడంపై దర్యాప్తు చేయాలనీ పట్టణ కౌన్సిల్లర్లు మున్సిపల్ చైర్పర్సన్ ను కోరగా వెంటనే మున్సిపల్ కమిషనర్ ను దర్యాప్తు చేసి నివేదిక అందించాలని సూచించారు. రానున్న వినాయక చవితి, బతుకమ్మ పండుగల సందర్భంగా పట్టణ 6, 7వ వార్డు ప్రజల పక్షాన గణపతి కుంటకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలనీ ఆయా వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ చైర్పర్సన్ కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పాలకవర్గం సభ్యులు, కో -ఆప్షన్ సభ్యులు,మున్సిపల్, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడూ చట్టాన్ని గౌరవించాలి

**గీతం ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన మాజీ జడ్జి డాక్టర్ డి.హేమంతకుమార్**

**పటాన్చెరు జులై 31 (జనంసాక్షి)**
మనదేశంలోని ప్రతి పౌరుడూ చట్టాన్ని గౌరవించాలని, లేదంటే కోర్టుల్లో తదనంతర పరిణామాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని మాజీ జిల్లా-సెషన్స్ జడ్జి, తెలంగాణ ఎన్నికల సంఘం న్యాయ సలహాదారు డాక్టర్ డి.హేమంత కుమార్ స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని తొలి ఏడాది ప్రేరణ కార్యక్రమం-2025లో భాగంగా, 'చట్టపరమైన హక్కులు, బాధ్యతలను సూచించడం'పై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. పుట్టుక నుంచి మరణం వరకు జీవితంలోని ప్రతి దశలోనూ చట్టం యొక్క ఔచిత్యాన్ని డాక్టర్ హేమంత్ వివరించారు. ర్యాగింగ్ నిరోధక చట్టాలు, ఫోక్సో చట్టం, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం, రాజ్యాంగ నిబంధనలు, ప్రాథమిక హక్కులు, బాధ్యతలతో సహా పలు కీలక చట్టాల గురించి విద్యార్థులకు ఆయన విడమరచి చెప్పారు. ఈ చట్టపరమైన చట్టాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, న్యాయ సలహా



కోరుకునే ఎవరైనా జిల్లా న్యాయ సేవా సంఘం చైర్మన్ లేదా కార్యదర్శికి లేఖ రాయడం ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలియజేశారు. సమర్థవంత మైన అభ్యాస పద్ధతులపై దృష్టి సారించేలా ఆయన ఐసీఆర్ సూత్రాన్ని ప్రవేశపెట్టారు. ఐ అంటే ఆసక్తి (ఇంట్రస్ట్), సీ అంటే ఏకాగ్రత (కాన్సంట్రేషన్), ఆర్ అంటే పున:సమీక్ష (రివిజన్) అని చెబుతూ, ఆసక్తి, ఏకాగ్రతతో క్రమబద్ధమైన పున:సమీక్ష విద్యా విజయానికి కీలకమని నొక్కి చెప్పారు. సోషల్ మీడియాపై అధిక సమయం వెచ్చించడం గురించి ఆయన ప్రస్తావిస్తూ, రోజుకు 45 నిమిషాలు సోషల్ మీడియాకు వెచ్చిస్తే, ఏడాదికి 273 గంటలు వృధా అవుతాయని, అదే సమయాన్ని ఏదైనా ఇష్టమైన అంశాన్ని నేర్చుకోవడానికి కేటాయిస్తే అందులో నైపుణ్యం సాధించవచ్చన్నారు. మనదేశంలోని ప్రముఖ ఇంజనీర్లు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, నార్ల తాతారావు వంటి వారి జీవిత చరిత్రలను చదవడం ద్వారా ప్రేరణ పొందాలని తొలి ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థులకు డాక్టర్ హేమంత కుమార్ సూచించారు. సదుద్దేశం, అంకితభావంతో ఇంజనీరింగ్ విద్యను కొనసాగించేలా వారిని ప్రేరేపించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఈశ్వరయ్య పున్నా, అతిథిని సత్కరించడంతో ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమం ముగిసింది.

# ప్రాథమిక పాఠశాలకు ఆర్థికసాయం



**నంగునూరు, జులై 31 (జనం సాక్షి)**
సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి ప్రేరణ పొందిన పలువురు తమ వంతు సహకారాలు అందించడానికి ముందుకు వస్తున్నారు. టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి రూ.6,500లను పాఠశాలకు అందించారు. ఈ డబ్బులను గురువారం జంగిటి శ్రీనివాస్, అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి యాదవ్, దాసరి కిషన్, దేవులపల్లి శ్రీకాంత్ తదితరులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయపాల్ యాదవ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, రామక్రిష్ణ, శ్వేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయపాల్ యాదవ్ సంతోషం వ్యక్తం చేసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## శేష జీవితం ప్రశాంతంగా సాగాలి

**మాగనూర్ (జనం సాక్షి):** పదవీ విరమణ పొందిన తహశీల్దార్ నాగలక్ష్మి శేష జీవితం ప్రశాంతంగా సాగాలని వక్తలు ఆకాంక్షించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల తహసిల్దార్ జి నాగలక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిటి సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, శివరాం రెడ్డి, డిటి సురేష్, రికార్డు అసిస్టెంట్ ఫరుద్దీన్, ఆర్ఐలు శ్రీశైలం, బాలాజ్ ఏఎస్ఓ ఓమా చారి, వివిధ మండలాల తహసిల్దార్లు మండల రెవెన్యూ సిబ్బంది మాట్లాడారు. మాగనూర్ కు వచ్చిన అనతి కాలంలోనే తహశీల్దార్ అందరి మన్ననలు పొందారని అన్నారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పదని వారు చేసిన సేవలే గుర్తుండి పోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

భోజనం కోసం వండుతున్న వంటలను, విద్యార్థులకు రోజువారీగా ఇవ్వాల్సిన మెనూ పరిశీలి ంచారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వండి పెట్టాల్సిన బగారా అన్నం, మిక్స్‌డు వెజిటబుల్ కర్రీని వండకుండా సాధారణ అన్నం మరి మిల్ మేకర్ కర్రీని, చింతపులుసు చారును మాత్రమే వండడంతో పాటు 95 మంది విద్యార్థు లకు ఉండాల్సిన ఏడు కిలోల కూరగా యలకు బదులు చాలా తక్కువ క్వాంటిటీలో వండడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇంకోసారి ఇలా చేయమని క్షమించాలని జిల్లా కలెక్టర్ ను రాతపూర్వకంగా వేడుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నేను మరోసారి ఈ స్కూలుకు వస్తానని మెనూ ప్రకారం ఆహారం వండకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మధ్యాహ్న భోజనం నిర్వాహకులను హెచ్చరించారు. పంట గదిని కూడా పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. అలాగే మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం ఆహారం అందించేలా పర్యవేక్షించాలని ఇన్చార్జి హెచ్ఎంను ఆదేశించారు.

## 'లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయొద్దు

**- బిఆర్ఎస్ యువజన నాయకులు సాయి ప్రేమ్**



**సిద్దిపేట బ్యూరో జూలై 31 (జనంసాక్షి)**
సిద్దిపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయొద్దని బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సాయి ప్రేమ్ సామల్ల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలను వెనక్కి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 40 గజాల లోపు ఇళ్ల స్థలం ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించి , ఇప్పుడు వారికి అవకాశం లేదు, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నియమ నిబంధనలను సాకుగా చూపిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై 37వ వార్డు ఇంచార్జ్‌ను వివరణ కోరగా మాకు 40 గజాల స్థలం లోపు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేవు అని తెలిపారని అన్నారు. మాకు సంబంధిత అధికారుల ద్వారా సమాచారం వచ్చిన తరువాతనే వారు ప్రస్తుతం ఉంటున్న ఇళ్లను కూల్చాలని తెలిపారు. కానీ ఇప్పటికే అర్హులైన లబ్ధిదారులు వారి పాత ఇళ్లను కూల్చివేసి నూతన ఇళ్ల నిర్మాణం కోసం వారు వేచి చూస్తున్నారని తెలిపారు. ఇలా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో నియమ నిబంధనల పేరుతో అర్హులైన లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విద్యార్థి నాయకులు ఖమ్మం నరేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి వాకిటి శ్రీహరి

**గద్వాల నడిగడ్డ, జూలై 31 (జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కారమై వారు సుఖసంతోషాలతో జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మరింత శక్తి, సామర్థ్యం కలగాలని జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు రాష్ట్ర పశు సంవర్ధక,క్రీడలు,యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం సాయత్రం కుటుంబ సమేతంగా అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన మంత్రికి దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం సందర్శించి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర అభిషేకం కూడా నిర్వహించారు. అనంతరం శ్రీ జోగులాంబ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు అమ్మవారి ప్రసాదం శేష వస్త్రం బహుకరించి ఆశీస్సులు అందజేశారు. అనంతరం మంత్రి శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి నిత్య అన్నదాన సత్రమును ప్రసాద్ స్కీం భవనంలో పూజలో పాల్గొన్నారు. అంతకు ముందు హరిత హొటల్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,మాజీ జెడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య,ఆర్డీవో అలివేలు,అలంపూర్ తాసిల్దార్ మంజుల,ఈ.ఓ పురేందర్,స్థానిక అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో కుప్ప కూలిన రియల్ ఎస్టేట్ రంగం

- బీఆర్ఎస్ జిల్లా నేత షేక్ జహంగీర్

**వనపర్తి, జూలై 31 (జనంసాక్షి):**



ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్లనే రియల్ ఎస్టేట్ రంగం కుప్ప కూలిందని బీఆర్ఎస్ జిల్లా నేత, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ మాజీ సభ్యుడు షేక్ జహంగీర్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని, లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం నేడు అగమ్య గోచర పరిస్థితిలో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్లో పెట్టుబడి పెట్టిన వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రానికి రెవెన్యూను అందించే రిజిస్ట్రేషన్ శాఖ దిక్కుతో తోచని పరిస్థితిలో ఉందన్నారు. గతంలో కంటే ప్లాట్ల క్రయ, విక్రయాలు చాలావరకు ఆగిపోయి ఉన్నాయని, గతంలో ఉన్న ప్లాట్ రేట్లకు, ఇప్పుడున్న ప్లాట్లు రేట్లకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇంతకుముందు ఎక్కువ ధరకు అమ్ముడుపోయిన ప్లాట్లు ఇప్పుడు పెట్టుబడి కంటే తక్కువ ధరకు రేట్లు రావడం వల్ల పెట్టుబడిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిపై ఆధారపడ్డ కమిషన్ దారులు, మధ్యవర్తులు జీవనోపాధిని కోల్పోయి ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని, దేశంలోనే రియల్ ఎస్టేట్ రంగానికి ఒక గొప్ప దిక్సూచిగా ఉన్న హైదరాబాద్ నగరం నేడు మూడో స్థానానికి పడిపోయిందని వెల్లడించారు. రేవంత్ సర్కారు తీసుకున్న దూకుడు చర్యల వల్ల సామాన్యులు ప్లాటు తీసుకోవడానికి జంకుతున్నారని, గతంలో ఇండ్ల నిర్మాణం చాలా ఎక్కువ జరిగే ప్రాంతాల్లో ప్రస్తుతం తక్కువ నిర్మాణాలకు పరిమితమయ్యాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకొని రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడి జీవించే వారిని ఆదుకోవాలని జహంగీర్ డిమాండ్ చేశారు.

# విద్యార్థుల మేధస్సు పెంచేందుకు డిజిటల్ తరగతులు కీలకం

### విద్యార్థులకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుంది

### విద్యార్థులకు డిజిటల్ క్లాసును బోధించిన కలెక్టర్



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 31 (జనం సాక్షి):**
విద్యార్థుల మేధస్సు పెంచేందుకు డిజిటల్ తరగతులు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికగా సందర్శించారు. ఈ సందర్భముగా విద్యార్థులకు అందిస్తున్న విద్య, ఆహారం తదితర అంశాలపై కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలలో సకలసదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తరగతిలో విద్యార్థులతో కలిసి కూర్చుని ఉపాధ్యాయురాలు బోధించే విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, తాను కూడా విద్యార్థులకు డిజిటల్ తరగతిని బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సును పెంచేందుకు డిజిటల్ పాఠాలు కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్యం, విద్య, ఆహార నాణ్యతలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని, నూతన డైట్ మెనూ ప్రకారం ప్రతి ఒక్కరికి మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆహార నాణ్యతను పరిశీలించారు . పాఠశాల ఆవరణలో క్రమం తప్పకుండా సానిటేషన్ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. పిల్లల యొక్క మేధస్సును వెలికి తీయడం కోసం డిజిటల్ క్లాసులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో గణనీయంగా విద్యార్థుల అడ్మిషన్లు, హాజరు శాతం పెరిగినందున అందుకు అనుగుణంగా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో నిరంతర ఆదాయం

**- జి.సువర్ణ, సిద్దిపేట జిల్లా అధికారి, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ**

**నంగునూరు, జూలై 31 (జనం సాక్షి)**



ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తే నాలుగేళ్ల నుంచి నిరంతర ఆదాయం వస్తుందని ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి జి.సువర్ణ చెప్పారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో మంగు హరిహర రావుకు చెందిన పది ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సువర్ణ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఆయిల్‌పామ్ పంటలు అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఆయిల్‌పామ్ పంట వడగండ్లు వంటి ప్రకృతి విపత్తులను తట్టుకుంటుందని చెప్పారు. పంట ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుండి 30 సంవత్సరాల వరకు నిరంతర ఆదాయం వస్తుందని తెలిపారు. సందర్భంగా ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పి.భాస్కర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ విస్తరణ అధికారి నితీశ్ కుమార్, రైతు రంగు హరి హరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్న భరోసా, బీమా పథకముల దరఖాస్తు చేసుకోండి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**
నారాయణపేట జిల్లాలోని చేనేత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం సంక్షే మం కొరకు నేతన్న భరోసా, నేతన్న భద్రత పథకములను ప్రవేశపెట్టడం జరిగిందని చేనేత జే డి బాబు తెలిపారు.నేతన్న పొదుపు లో నమోదై న చేనేత కార్మికులు, అను బంధ కార్మికులం దరూ నేతన్న భరోసా, నేతన్న భద్రత (బీమా) పథకములలో నమోదు కొరకు దరఖాస్తులను జిల్లా కార్యాలయములో సమర్పించాలని తెలిపారు. నేతన్న భరోసా పథకములో నమోదైన చేనేత కార్మికులకు సంవత్సరానకు 18 వెలు, అనుబంధ కార్మికులకు 6 వెలు ప్రభుత్వం ద్వారా మం జూరవుతాయని తెలిపారు. నారాయణపేట జిల్లాలోని చేనేత కార్మికులు అనుబంధ కార్మికులందరూ త్వరగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. గత సంవత్సరం నేతన్న భీమా పథకములో నమోదైన చేనేత కార్మికులు దరఖాస్తులను సమర్పించవలసిన అవసరం లేదని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5 లోగా సమర్పించాలని అని తెలిపారు.

## బిసి గురుకుల విద్యార్థుల ఆందోళనపై కలెక్టర్ స్పందన



నాణ్యతలేని బియ్యాన్ని వెంటనే తిరిగి పంపి మంచి బియ్యాన్ని తెప్పించుకోవాలని, దీనిలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పాఠశాలలో ఆర్.ఓ. ప్లాంట్ పనిచేయడం లేనందున తాగడానికి వెంటనే మినరల్ వాటర్ అందించాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల నిత్యం బాధ్యతతో ఉండాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత విషయంలో పూర్తి నిఘా పెట్టాలని తేల్చి చెప్పారు.

**కలుగొట్ల కస్తూర్బా బాలికల విద్యాలయుల తనిఖీ**
అనంతరం ఉండవల్లి మండలం కలుగొట్ల గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయము ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల ఒక విద్యార్థినికి పాము కాటుతో అనుమానంతో ఆసుపత్రికి తరలించిన ఘటనపై ఆమెతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యత గల అంశం కావడంతో,పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, పాములు, హానికర కీటకాలు దూరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం ప్రతిరోజూ అందించాలని ఆదేశించారు. పాఠశాల రిజిస్టర్లను తనిఖీ చేసి,ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం పూర్తిగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కో ఆర్డినేటర్ అనీల, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ,కేజీవీబీ ప్రిన్సిపాల్ పరిమళ,సబ్ ఇన్స్పెక్టర్ శేఖర్,వార్డెన్ రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ దొడ్డిలో పౌర హక్కుల దినోత్సవం

**మల్దకల్ జూలై 31 (జనంసాక్షి)**
మండలంలోని నాగర్ దొడ్డి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పౌర హక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఆర్ఐ మధు మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని ఎవరైనా కుల వివక్షత పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయ ప్రవేశం,రెండు గ్లాసుల పద్ధతి ఉండకూడదని అందరూ సమానంగా కలిసిమెలిసి జీవించాలన్నారు. ఏఎస్ఐ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి తిరుమలయ్య,గ్రామ పెద్దలు జార్జి తదితరులు పాల్గొన్నారు.



# నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కావాలా వద్దా?

**కవితకి ప్రజల తరపున సూటి ప్రశ్న..**

**ప్రాజెక్టుపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు బాధ్యతారహితమైనవి**

**రైతుల ఆశలపై నీళ్లు చల్లే ప్రయత్నం**




**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల సాగునీటి పథకంపై రాష్ట్ర జాగృతి అధ్యక్షు రాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భాధ్యత రహితంగా మాట్లాడారని,ఈ ప్రాంత రైతుల ఆశయం పై నీళ్లు చాల్లే ప్రయత్నం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కవితపై అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఅర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక హక్కులు, నీళ్ల-నిధులు-నియామకాలు లక్ష్యంగా తెచ్చామని చెప్పుకున్న బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత నేడు నారాయణపేట జిల్లా కనుకుర్తి గ్రామానికి వచ్చిన సందర్భంగా ప్రాజెక్టుపై రైతులను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేశారన్నారు. ఇది చాలా బాధాకరమన్నారు. ఎన్నో దశబ్దాలుగా ఈ ప్రాంత రైతుల సాగు నీటి కోసం ఎదురుచూస్తూ ప్రాజెక్టు కోసం ఈ ప్రాంత మేధావులు,రైతులు,అన్ని వర్గాల ప్రజలు నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం సంవత్సరాల తరబడి పోరా టం చేశారని, ఇలాంటి ప్రాజెక్టుపై ఎమ్మెల్సీ కవిత అసత్యారోపణలతో విమర్శించడం బాధ్యతా రహిత చర్య అన్నారు. ప్రాజెక్టు పూర్తైతే నారాయణపేట,మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లోని వేల ఎకరాల భూములకు సాగునీరు లభించనుంది. ఉట్కూర్-పెరపళ్ల-కానుకుర్తి రిజర్వాయర్ల ద్వారా చెరువుల గొలుసు నింపే పథకం ఇది. భూసేకరణ బాధితులకు చరిత్రలో ఎప్పుడూ లేనంత వేగంగా నష్ట పరిహారం అందించడం జరుగుతుందన్నారు. ఎవరూ బలవంతంగా భూములు ఇవ్వడం లేదని, కోర్టు మార్గం కూడా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. మీరు ఈ ప్రాంతం అభివృద్ధి కావాలనుకుంటున్నారా? సాగునీరు కావాలనుకుంటున్నారా? లేదంటే రాజకీయ విమర్శలతో మళ్ళీ చీకటి రోజులకు వెళ్లాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టు పై అవగాహన లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తూ అమాయక రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూ రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కాలు వల నిర్మాణం చేయకుండానే నీళ్లు ఇస్తామని, ఉగాదికి ఆ నీళ్లతోనే పచ్చడి తాగుదామని అప్పటి మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి రైతులను మోసం చేస్తే ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారన్నారు. గత 20 ఏళ్ల నుండి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజల సంక్షేమనికి తన సామాజిక సేవలతో ఓ ఆశయంతో పనిచేస్తూ,నేడు రైతుల గొంతుకగా ఉన్న కుంభం. శివకుమార్ రెడ్డి వారి భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తి పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చే ప్రతి రైతుకు తగిన నష్టపరిహారం, కుటుంబాల బాగుపడేలా అన్ని విధాలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం. పర్ణిక రెడ్డి ల నేతృత్వంలో ఇది రైతుల కలల ప్రాజెక్టుగా మారనుంది. మా ఒకటే అభ్యర్థన ఈ ప్రాంత రైతులు, ప్రజల చిరకాల ప్రాజెక్టుపై బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయకుండా, నిజాలను గౌరవించండి. రాజకీయ విమర్శలు పక్కనబెట్టి, ప్రజల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో కలిసి రావాలన్నారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండి.సలీం,దామరగిద్ద మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఈ దప్ప, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎండి. గౌస్, దామరగిద్ద మండల నాయకులు శ్రీనివాస్, శరణ్ నాయక్, ఖాజా,లక్ష్మణ్, అనంద్, బస్వరాజ్, శంకర్,బోయ శరణప్ప, తదితరులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డి కర్ణసింహరెడ్డి ఆర్థిక సహాయం



**మానవపాడు, జూలై 31 (జనం సాక్షి)**

మానవపాడు మండల పరిధిలో.. జల్లాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త, తన అభిమాని జమ్మన్న కుటుంబ సభ్యులను గురువారం కర్నూల్ ప్రభుత్వ జనరల్ హాస్పటల్ లో జల్లాపురం గ్రామ మాజీ నీటి సంఘం అధ్యక్షుడు బిఆర్ఎస్ నాయకుడు లక్కిరెడ్డి కర్ణసింహ రెడ్డి పరామర్శించారు. బుధవారం జమ్మన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఇట్టి విషయం తెలుసుకున్న లక్కిరెడ్డి కర్ణసింహ రెడ్డి,మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని మృతుడు జమ్మన్న కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డి కర్ణసింహరెడ్డి, గ్రామ సామాజిక కార్యకర్త శాంతకుమార్, బీచుపల్లి నాయుడు, రైతు సంఘం మద్దిలేటి, చిన్న కిష్టన్న, చందు, పెద్ద ఎల్లప్ప, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ప్రశ్నిస్తే కేసులా

**- ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షుడు రమేశ్**

**భూత్పూర్, జులై 31(జనంసాక్షి):** ప్రజా పాలనలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. జి.వి.ఎస్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచారు. ఈ సందర్భంగా గాంధీభవన్ ముట్టించకుండా పోలీసులు మండల నాయకులను ముందస్తు హౌస్ అరెస్టు చేసి పోలీస్టేషన్ కు తరలించారు. ప్రజా పాలనలో ప్రశ్నిస్తే కేసులు,ముందస్తు హౌస్ అరెస్టులు చేయడం దౌర్భాగ్యమని ముందస్తు అరెస్టులు ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని రమేశ్ హెచ్చరించారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన లంబాడీ జాతికి మంత్రి పదవి ఇవ్వాలని, గిరిజన విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని,గిరిజన విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్పు విడుదల చేయాలని,గిరిజన గురుకులాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

# కాశింనగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు మాధవరెడ్డి పేరు

- **మాధవరెడ్డి ఉచిత వైద్య సేవలకు గౌరవం**
- **వనపర్తి నియోజకవర్గానికి 4 వేల ఎకరాలకు సాగు నీరు**
- **రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి బ్యూరో జులై 31 జనంసాక్షి**

వనపర్తి నియోజకవర్గంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ప్రత్యేక చొరవతో ఆరు గ్రామాలు,13 గిరిజన తాండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన పనులు చేశారని, సీఎం రేవంత్ రెడ్డి ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌కు జిల్లెల మాధవ రెడ్డి పేరు పెట్టారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిన్నారెడ్డి మాట్లాడారు. కాశిం నగర్, జయన్న తిరుమలాపురం,మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తయిపల్లి, అంజనగిరి గ్రామాలతోపాటు మరో 13 గిరిజన తాండాలకు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని పేర్కొన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండటం వల్ల మాధవరెడ్డి(కాశిం నగర్ )లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. డి8 నుంచి రామన్న గట్టు రిజర్వాయర్‌కి నీళ్లు తెచ్చి అక్కడి నుంచి మూడు లిఫ్టుల ద్వారా ప్రాంత రైతన్నలకు సాగునీరు అందిస్తామన్నారు. మొదటి లిఫ్టు ద్వారా కాసిం నగర్ కు 1,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని రెండో లిఫ్ట్ దత్తాయపల్లి, అంజరగిరికి 1,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని మూడో లిఫ్ట్ జయన్న తిరుమ లాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తయిపల్లి లకు 2,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. రేపటి నుంచి సర్వే పనులు శరవేగంగా మొదలవుతున్నాయన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌కు వనపర్తి నియోజకవర్గం ప్రముఖ డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డి పేరు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సాధారణ మధ్యతరగతి



కుటుంబంలో పుట్టి పెరిగిన మాధవ రెడ్డి తన తల్లిదండ్రుల కోరిక మేరకు డాక్టర్ అయ్యారని అన్నారు. మాధవ రెడ్డి గాంధీలో మెడిసిన్ కంప్లీట్ చేసి ఉస్మానియా, నిమ్స్ హాస్పటల్లో వైద్య సేవలు అందించారని అన్నారు. వనపర్తి నియోజకవర్గ ప్రజల ప్రజల మీద మక్కువతో పుట్టి పెరిగిన ప్రాంతానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ ప్రతి ఆదివారం వనపర్తిలో ఉచిత వైద్య సేవలను అందించాలని అన్నారు. న్యూరో సర్జన్ గా మంచి గుర్తింపు తెచ్చుకుని ప్రముఖ హాస్పిటల్‌లో అపోలో, యశోద హాస్పిటల్స్ లో వైద్య సేవలు అందించాలని అన్నారు. ఎన్నో ఏళ్లుగా చివరి ఆయకట్టుకు సాగు నీరు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పిందని చిన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని త్వరగా పనులు పూర్తి చేసి రైతన్నలకు సాగునీరు అందిస్తామని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేసి జిల్లెల మాధవరెడ్డి పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డికి చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నందిమల్ల యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్, వెంకటేశ్వర్ రెడ్డి,మెంటే పల్లి రాములు, అబ్దుల్లా, కమ్మర్ రెహమాన్, గడ్డం వినోద్, రాగి అక్షయ్, నాగార్జున, ఇర్ఫాన్, చరణ్, రాంబాబు, లక్ష్మయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## జోగులాంబ అమ్మవారి సన్నిధిలో చిన్నారెడ్డి

**వనపర్తి బ్యూరో జులై 31 జనంసాక్షి**

అలంపూర్ జోగులాంబ అమ్మవారిని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. చిన్నా రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 382 కోట్లు కేటాయించారని వెల్లడించారు. 3 సంవత్సరాలలో పనులు పూర్తి చేసి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సహ దేవుడు, ఆనంద్ , పెద్దమందడిసోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, దేవాలయ కమిటీ చైర్మెన్ నాగేశ్వర్ రెడ్డి, దేవాలయం కమిటీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధిపేట మున్సిపాలిటీలో అవినీతి పెరిగిపోతోంది

- కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం

**సిద్దిపేట బ్యూరో జులై 31 (జనంసాక్షి)**



అవినీతికి కేరాఫ్ సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అని కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, బీఆర్ఎస్ నాయకుడు ఉదర మణిదీప్ రెడ్డి ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ చట్టంలోని నిబంధనలు అడ్డు పెట్టుకొని చెక్ ల రూపేనా ప్రజా ధనాన్ని పెద్ద ఎత్తున దారి మళ్లించాడని మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ ప్రజల అత్యవసరాల కోసం మాత్రమే చెక్ జారీ చేయాల్సి ఉంటుం దన్నారు. 10 నెలల కాల వ్యవధిలో సుమారు కోటిన్నర వరకు 148 చెక్‌ల రూపేనా నిధులు దారి మళ్లించినట్లు ఆరోపించారు. ఇంటి పన్ను పున పరిశీలన పేరిట పాలక వర్గాన్ని తప్పు దోవ పట్టించి పట్టణ పరిధిలోని కమర్షియల్ బిల్డింగులు, పెద్ద భవనాల ఆస్తీ పన్నులను కుదించి బల్దియా ఆదాయానికి గండి కొట్టారన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌ను మెప్మా నిధులతో ఆధుని కరించినట్లు తెలుత చెప్పిన మున్సిపల్ కమిషనర్ నేడు స్వంత నిధులతో ఆధునీకరించినట్లు వెల్లడించడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవానికి మెప్మా నిధులను మున్సిపల్ కార్యాలయ పనుల కోసం వినియోగించుకునే అవకాశం ఉండదన్నారు. మున్సిపల్ కమిషనర్ అవినీతి పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దుర్వినియోగం చేసిన డబ్బుల రికవరీ తో పాటుగా విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు.

## పోతిరెడ్డిపల్లి పెద్దరాజుపేట పాఠశాలకు ప్రహరి గోడ నిర్మించాలి

- సిపిఐ ఆధ్వర్యంలో చేర్యాల తహసిల్దార్ కు వినతి

**చేర్యాల జులై 31 (జనంసాక్షి) :**

చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి– పెద్ద రాజుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు ప్రహరి గోడ నిర్మించాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేర్యాల తహసిల్దార్ దిలీప్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల గ్రామానికి దూరంగా ఉండడంతో పాటు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విషపూరితమైన చీడ పురుగులు, పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని, పాఠశాల చుట్టూ ఉన్న చెట్లకు రక్షణ లేకపోవడం, సాయంత్రం వేళ అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే పరిస్థితి ఉందన్నారు. వెంటనే ప్రహరీ గోడను మంజూరు చేసి నిర్మాణ పనులను చేపట్టేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కమిటీ సభ్యులు పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, ఆరుట్ల లింగం, తుమ్మలపల్లి అనిల్, సిద్దిరాం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి వాకిటి శ్రీహరి



**గద్వాల నడిగడ్డ,జులై 31(జనం సాక్షి)**

కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దా లన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తున్నదని రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసు లు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గురువారం అలంపూర్ చౌరస్తాలోని ఫంక్షన్ హాల్ నందు ఇందిరా మహిళా శక్తి,రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్, అలంపూర్ శాసన సభ్యులు విజయుడుతో కలిసి పాల్గొని,జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మహిళల పేరు మీద అన్ని పథకాలు అమలు చేయడం జరుగుతోం దన్నారు. గతంలో ఏడాదికి ఒకసారి కళ్యాణ లక్ష్మి చెక్కులు ఇస్తే,ఇప్పుడు మూడు నెలలకు ఇస్తున్నామని ఆయన చెప్పారు. ప్రభుత్వం 2600 మహిళా సంఘాలకు వడ్డీ లేని రూ.3.15 కోట్ల రుణాలను అందించిందని వెల్లడించారు.తాము నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను రూ.175 కోట్లతో పారదర్శకతతో, అవినీతికి తావు లేకుండా నిర్మించి ఇస్తున్నామన్నారు.గృహ అవసరాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని పేర్కొన్నా రు. పెట్రోల్ బంకులు,1000 బస్సులకు యజ మానులుగా చేసి మహిళలను నెలకు 59 వేల రూపాయల ఆదాయం కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్ తరాల కోసం విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు అందజేస్తున్నామని తెలిపారు.సన్న బియ్యం పథకాన్ని దేశంలోనే ప్రత్యేకంగా అమలు



చేస్తున్నామని పేర్కొన్నారు.ఇంకా అనేక మంది మహిళలు సంఘాల్లో సభ్యులుగా చేరి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ముందుకు సాగాలని వారికి పిలుపుని చ్చారు. ప్రభుత్వం ఏర్పడిన 18 నెలలలోనే ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో అవసరం మేరకు అన్ని వర్గాల వారికి కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేస్తున్నామని,పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బలమైన



చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వడ్డీ లేని రుణాలు, ఉపాధి అవకాశాలు, యూనిఫామ్ తయారీ, వడ్ల కొనుగోలు కేంద్రాల వంటి పథకా లు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొ న్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేం దుకు రూ.3 కోట్ల వ్యయంతో సోలార్ పవర్ ప్లాంట్, పెట్రోల్ బంకులు,మహిళలకు బస్సులకు యజమానులుగా చేసి ఆదాయం సమకూర్చడం జరుగుతుందన్నారు. అలంపూర్ నియోజక వర్గానికి 3 కొత్త రేషన్ కార్డులు మంజూరు, 19 వేల పేర్లను కొత్తగా నమోదు చేయడం జరుగు తుందన్నారు. రేషన్ కార్డుల ద్వారా అందిస్తున్న ఉచిత సన్న బియ్యాన్ని బాధ్యతగా వినియోగిం చుకోవాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజల ప్రయోజనానికి అందుబాటులోకి వచ్చాయని చెప్పారు.మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అలంపూర్ నియోజకవర్గంలోని 2041 మహిళా సంఘాల సభ్యులకు 30.58 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును,2600 సంఘాలకు 3.15 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. మృతి చెందిన 23 మంది మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు 13.89 లక్షల బీమా చెక్కులను,కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులకు ఉత్తర్వులను అందజేశారు. తదనంతరం జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా గొర్రెలకు నీలినాలుక వ్యాధి నిరోధక టీకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అలంపూర్ శాసనసభ్యులు విజయుడు, అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, ఆర్డీవో అలివేలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడప్ప, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవాలకు ముఖ్యమంత్రి, గవర్నర్‌లను ఆహ్వానిద్దాం..

### ఉత్సవాలను నియోజకవర్గ చరిత్రలో నిలిచేటట్టుగా జరుపుకుందాం : ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

**జడ్చర్ల, జులై 31 (జనం సాక్షి):**

బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మలను ఆహ్వానిద్దామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్ 27, 28 29 తేదీల్లో నిర్వహించే 3 రోజుల శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ముఖ్య మంత్రి, గవర్నర్లను ఆహ్వానిద్దామని అందుకు ఆగస్టు రెండో వారంలో వారిని కలుసుకుందామని తెలిపారు. నవంబర్ 28న మ్యూజికల్ నైట్ పెద్ద ఎత్తున నిర్వహిద్దా మన్నారు.



ఉత్సవాలు నియోజకవర్గ చరిత్రలో నిలిచేట్లుగా జరుపుకుందామని వివరించారు. అనంతరం పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలపై ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి. కృష్ణ వివరిస్తూ 1000 మందికి పైగా విద్యార్థులు పాఠశాలలో ఉన్నందున టాయిలెట్ కాంప్లెక్స్ బాలురు, బాలికలకు వేరువేరుగా నిర్మించాల్సిన అవసరం ఉందని, డైనింగ్ హాల్ నిర్మాణం, హైమాస్ట్ లైట్లు, 8 అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అత్యవసరంగా టాయిలెట్ కాంప్లెక్స్, డైనింగ్ హాల్ నిర్మాణాల కోసం నిదుల కేటాయింపు కృషి చేస్తానని వెల్లడించారు. మిగిలిన వసతులకు సంబంధించి ముఖ్యమంత్రితో మంజూరు చేయించుకుందామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్ ఎంఈఓ మంజులా దేవి, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ది బాలకృష్ణ, సయ్యద్ ఇబ్రహీం, గోపాల్, వెంకటేష్, టైటాస్, సత్యం, కంచుకోట ఆనంద్, శ్రీను, సంతోష్ చారీ తదితరులు పాల్గొన్నారు.

# "నారింజ ప్రాజెక్టు"కు వరద

## జూలై మాసం లోనే జలకళ



**న్యాల్ కల్, జూలై 31, (జనం సాక్షి) :** దాదాపు ఒక టీఎంసీ నీటి సామర్థ్యం గల "నారింజ ప్రాజెక్టు"లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో జలకళ సంతరించుకుంది. న్యాల్ కల్ మండలంలోని రేజింతల్, ఝరాసంఘం మండలంలోని ఎల్గోయి, జహీరాబాద్ మండలంలోని కొత్తూరు గ్రామాల శివారు ప్రాంతంలోని నారింజ ప్రాజెక్టును దశాబ్దాల క్రితం నిర్మించారు. నారింజ ప్రాజెక్టు జన్మస్థలం కోహిర్ మండలం, బిలాల్ పూర్ గ్రామం. బిలాల్ పూర్ గ్రామ శివారు ప్రాంతం నుండి రాయిపల్లి, ఎల్గోయి, రేజింతల్, గ్రామాల శివారు మీదుగా.. జహీరాబాద్ - బీదర్ రోడ్డు, కొత్తూరు గ్రామ శివారులో ప్రాజెక్టును నిర్మించారు. అప్పట్లో దాదాపు 3000 ఎకరాలకు సాగు మీరు అందించేందుకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికి సైతం కనీసం ఒక ఎకరానికి సాగునీరు అందించ లేని పరిస్థితి నెలకొంది. న్యాల్ కల్, కోహిర్, జహీరాబాద్, ఝరాసంఘం మండలాల పరిధిలోని శివారు గ్రామాల నుండి వరద నీరు నారింజ ప్రాజెక్టులోకి చేరుతుంది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో సమీపంలోని బోరు బావులు, బావుల్లోకి భూగర్భ జలాలు పెరగడంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతంలోని రైతులకు ప్రయోజనం కలుగుతోంది. సాధారణంగా ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో కురిసిన భారీ వర్షాలతో నారింజ ప్రాజెక్టు లోకి వరద నీరు చేరి కర్ణాటక ప్రాంతానికి తరలి వెళ్లడం, వీక్షించడం సర్వసాధారణం. ఐతే మండలంలో జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షాలు కురిశాయి. జూలై మాసంలో సాధారణ వర్షపాతం కంటే మండలంలో 58 శాతం అత్యధికంగా వర్షాలు కురవడంతో నారింజ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దాదాపు ఒక టీఎంసీ సామర్థ్యం గల ప్రాజెక్టులోకి వరద నీరు చేరడంతో జలకళను సంతరించుకుంది. జూన్ మాసంలో 119 మిల్లీ మీటర్ల వర్షపాతం గాను 53.1 మేర కురిసింది. 56 శాతం తక్కువ వర్షపాతం నమోదు అయింది. ఐతే జూలై మాసంలో 152.8 మిల్లీ మీటర్లకు గాను జూలై 26 తేదీ నాటికి 241.7 వర్షపాతం నమోదు అయింది. అత్యధికంగా 58.2 వర్షం కురిసింది. ప్రాజెక్టు గేట్లకు కనీస మరమ్మత్తులు చేపట్టకపోవడం, వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో ప్రాజెక్టు లోని వరద నీరు కర్ణాటక ప్రాంతానికి తరలి వెళుతోంది. ప్రభుత్వం ప్రభుత్వ, యంత్రాంగం దృష్టి సాధించి స్థానిక రైతాంగానికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## కుటుంబాన్ని పరామర్శించిన పద్మా దేవేందర్ రెడ్డి

**చిన్న శంకరం పేట జులై 31 (జనం సాక్షి)** మండలంలోని జంగరాయి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ బందెల జ్యోతి ప్రభాకర్ బావ ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకొన్న ఆర్ ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి తాజా మాజీ ఎమ్మెల్యే ఈ రోజు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు తాజా మాజీ సర్పంచ్ లు మంచాల లక్ష్మణ్, దయానంద్ యాదవ్, మండల నాయకులు పడాల శ్రీనివాస్, బందెల సుధాకర్, ధర్మా రెడ్డి, బందెల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా చిత్ర పటానికి పాలాభిషేకం



**చేర్యాల జులై 31 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే కోట కింద కేటాయించిన 54 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం పట్ల చేర్యాల పట్టణంలో గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం లబ్ధిదారు లకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్ నర్సయ్య, జిల్లా నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోల్ చంటి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పూర్మ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, నియోజకవర్గ యూత్ ఇంచార్జ్ శివగారి అంజయ్య, పట్టణ కార్యదర్శి బురగోని తిరుపతి గౌడ్, వార్డు ఇంచార్జిలు ఎండి. ఎక్బాల్, యాట యాదగిరి, మంచాల కొండయ్య, పచ్చిమద్ల సిద్దిరాములు గౌడ్, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు బిరెడ్డి ఇన్నారెడ్డి, నాయకులు పంతులు నరసయ్య, కాసెట్టి భాగ్యయ్య,రాళ్లబండి పరిపూర్ణం, పచ్చిమద్ల మానస గౌడ్, పుల్లన్నగారి రాజు, ఔషధ్రకిషోర్, వెంకటేష్, భూమిగారి రాజేందర్, నర్ర అయిలయ్య, బూరగోని నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సెహగల్ ఫౌండేషన్‌ఆధ్వర్యంలో హెచ్‌డిఎఫ్‌సి పరివర్తన్ ప్రాజెక్ట్




**చిన్న శంకరంపేట జులై 31(జనం సాక్షి)** మండలంలోని మదూర్ గ్రామంలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌డిఎఫ్‌సి పరివర్తన ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం సరైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రధానంగా సేంద్రియ సాగు, హరిత ఎరువులు, ఎండు నూనే పంటల సాగు, పురుగు నియంత్రణ విధానాలు, ఇతర వ్యవసాయ సంబంధిత అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ముఖ్య వ్యక్తులుగా శేఖర్ వ్యవసాయ విస్తరణ అధికారి, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, మందీప్ వ్యవసాయ నిపుణుడు సెగల్ ఫౌండేషన్, గౌతమ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, విక్రాంత్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, కావ్య రెడ్డి గ్రామ కమ్యూనిటీ మొబిలైజర్, సెగల్ ఫౌండేషన్ బృందం ఇట్టి సమావేశం రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయవ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టి పర్యావరణ సూస్థిస్సందుకు ప్రోత్సహించేలా కొనసాగింది. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలు

**గీత కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి - కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్ గౌడ్**



**చేర్యాల జులై 31 (జనంసాక్షి) :** చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన మెరిగె నర్సింలు గౌడ్ రోజు వారీ తన కల్లు గీత వృత్తిలో బాగంగా గురువారం ఉదయం తాటి చెట్టుపై నుండి ప్రమాదవశాత్తు కింద పడడంతో వెన్నుపూసకు బలమైన గాయాలతో పాటు శరీరంపై అక్కడక్కడ బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న గీత కార్మికులు అతన్ని చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ ప్రథమ చికిత్స చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్న మెరిగె నర్సింహులు గౌడ్‌కు ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా అందించి అతని కుటుంబాన్ని అన్ని విధాలుగా అదుకోవాలన్నారు. ప్రభుత్వం కల్లు గీత కార్మికుల మరణాలను తగ్గించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లను చేర్యాల రూరల్, చేర్యాల పట్టణం, కొమురవెల్లి, మద్దూరు, దుల్మిట్ట ప్రాంతంలోని కల్లు గీత కార్మికులకు వెంటనే పంపిణి చేయాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బండకింది అరుణ్ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నాగల్ గిద్ద ఎస్సై రామకృష్ణకు ఘన సన్మానం



**నాగల్గిద్ద జులై 31 (జనం సాక్షి)** నాగల్ గిద్ద మండలంలోని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్ రావు పాటిల్ ఆధ్వర్యంలో ఎస్సైగా నూతన బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణకు ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతలు ప్రజల అవసరాలు తీర్చడంలో ఎల్లవేళ సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంజీవరావు పాటిల్, మనోహరావు పాటిల్,బస్వారాజ్, బస్వారాజ్ నాగపూరే, సోపాన్ రావు పాటిల్, జంగం బస్వారాజ్, విజయ్ కుమార్ గాడ్గే, నారసింగ్ రావు పాటిల్ రూప్ సింగ్, కంగ్టి వైజినాథ్,సోమిదాస్ , విజయ్ కుమార్ స్వామి, నాగప్పు, విట్టల్ రెడ్డి ఎస్ సి సెల్ అధ్యక్షులు సుభాష్, శివారెడ్డి అశోక్ మోర్గి,అబ్దుల్ రహీం, కాశీనాథ్ పాటిల్, తదితరులుపాల్గొన్నారు.

## విద్యార్థులకు గుర్తింపు కార్డుల ప్రధానం

**న్యాల్ కల్, జూలై 31, (జనం సాక్షి) :** మండలంలోని రేజింతల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సేవా దృక్పథంతో గుర్తింపు కార్డులను ప్రధానం చేశారు. పదవి విరమణ పొందిన ఏఎస్ఐ సురేష్ గురువారం పాఠశాలకు చెందిన 110 గురు విద్యార్థులకు అందజేశారు. అలాగే మరో ఏఎస్ఐ మల్లికార్జున్ పాఠశాల ఆవరణలో స్టేజి నిర్మాణం కోసం కొంతమేర ఆర్థిక సాయాన్ని అందజేశారు. మరో విశ్రాంత ఉద్యోగి ప్రభాకర్ రావు విద్యార్థులకు టీ షర్ట్స్, షూస్ లను అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్నాథ్, పాఠశాల అధ్యక్షుడు బసయ్య స్వామి, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, సంగమేశ్వర్, సరిత, కృష్ణ, నరేందర్, శ్వేత, గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు అండగా సిఎంఆర్‌ఎఫ్

**- ఎమ్మెల్యే జిఎంఆర్**



**పటాన్చెరు జులై 31(జనంసాక్షి)** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీకి చెందిన బిక్షపతి గత కొంతకాలంగా అనారోగ్యంలో బాధపడుతున్నారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్‌ఓసి మంజూరు అయింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసి అనుమతి పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు.

## దాతల సహకారం అభినందనీయం

**- దాతల సహకారంతో దేవాలయం పునర్నిర్మాణం**

**- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి**



**జడ్చర్ల, జులై 31 (జనం సాక్షి):** పురాతన శ్రీ హనుమాన్ దేవాలయ పునర్నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సమీపంలో ఉన్న పురాతన శ్రీ హనుమాన్ దేవాలయం దాతల సహకారంతో చేపడుతున్న పునర్నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దాతలతో కలిసి శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని అలాంటి పురాతన శ్రీ ఆంజనేయ స్వామి (హనుమాన్) దేవాలయ పునర్నిర్మాణానికి దాతల సహకారం వెలకట్టలేనిదని, పురాతన ఆలయాలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా దాతలు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత, వైస్ చైర్ పర్సన్ సారిక, కౌన్సిలర్లు జ్యోతి రెడ్డి, ఉమాదేవి, రాజు, నాయకులు వెంకటేశం, చటమోని రమేష్ యాదవ్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

**- సిపిఐ నాయకురాలు గంగమ్మ**

**సంగారెడ్డి, జులై 31(జనం సాక్షి)**

ఈనెల 2, 3 తేదీలలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ లో నిర్వహించే సిపిఐ జిల్లా 4వ మహాసభలు విజయవంతం చేయాలని సిపిఐ మునిపల్లి మండల నాయకురాలు గంగమ్మ పిలుపునిచ్చారు. గురువారం మునిపల్లి మండలంలోని బుదేరా చౌరస్తా లోని సిపిఐ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 2,3 తేదీలలో నారా యణఖేడ్‌లో సిపిఐ జిల్లా 4వ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మునిపల్లి మండలంలోని ప్రతి గ్రామం నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు లింగం, ప్రియాంక, మంజుల తదితరులు పాల్గొన్నారు.





# పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియ వేగం చేయండి

**జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశం : జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**



**సంగారెడ్డిప్రతినిధి, జులై 31 (జనం సాక్షి)**

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని నిర్ణీత వ్యవధిలోగా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ (డిపిసి) సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి కన్వీనర్‌గా జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ తుల్జా నాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రూ. 28 లక్షల సబ్సిడీకి డిపిసి ఆమోదం తెలిపింది. ఈ వర్గాలకు చెందిన యువత పరిశ్రమల స్థాపనలో ముందుండాలని ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.రా మెటీరియల్స్ సరఫరా, భూ కమతాల మంజూరు, విద్యుత్ కనెక్షన్లు అనుమతుల కోసం దరఖాస్తు చేసిన పరిశ్రమల విషయమే సమావేశంలో చేర్చించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు పూర్తి చేసిన ఫైళ్లను త్వరితగతిన ఆయా శాఖల అధికారులు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ తుల్జా నాయక్ మాట్లాడుతూ టీజీ ఐపాస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు జారీ చేసే ప్రక్రియను పరదర్శికంగా జిల్లాలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పిసిబి), హెచ్ఎండిఏ, డిటిసిపి, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్, ఎక్సైజ్ శాఖ విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గురుపీఠంలో సుహాసిని రెడ్డి పూజలు

**శివ్వంపేట జూలై 31 జనంసాక్షి:** శివ్వంపేట మండలం గూడూర్ లోని శ్రీ గురుపీఠంలో కొలువైన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతానం, శీ షిరిడి సాయిబాబా దేవాలయంలో మూల మూర్తులను గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి దర్శించుకొని పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు భక్తులు కూడా మూల మూర్తులను దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు భక్తులు అభిషేకాలు, అర్చనలు చేపట్టి గురుదేవుల ఆశీస్సులు పొందారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్, గురువారం అన్నప్రసాదం కోసం బియ్యాన్ని అందజేశారు. ఆలయ వ్యవస్థాపకులు, శ్రీ గురుఫిఠం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు అన్నదానం చేశారు. శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో, శ్రీ దత్తాత్రేయ మహాస్వామి గురుపరంపరులు, సాయిబాబా దేవతల యొక్క ఆశీర్వాదాలు ఎల్లవేళలా భక్తులకు ఉంటాయని వారికి ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలు లభించాలని శ్రీ గురుపీఠం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పెద్దగౌని శివకుమార్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, జిన్నారం పెద్దగౌని శ్రీనివాస్ గౌడ్, రాజం బిక్షపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ సిబ్బంది కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, బల్కంపేట భాస్కర్, భక్తులు తదితరులు ఉన్నారు.



## కస్తూర్బా పాఠశాలను ఆకస్మిక తనిఖీ

**- రేగోడ్ మండల విద్యాధికారి గురునాథ్**

**రేగోడ్, జూలై 31 (జనంసాక్షి) :**

మండల కేంద్రమైన రేగోడ్ లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం మండల విద్యాధికారి గురునాథ్ ఆకస్మిక తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను గ్రహించి పరిశీలించారు.అనంతరం స్టోర్ రూమ్‌లో ఉన్న పలు కూరగాయలు వంట సరుకులు పలు రికార్డులను పరిశీలించారు.అనంతరం విద్యాధికారి గురునాథ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థినిలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కస్తూరిబా ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. మెరుగైన విద్యను అందించి మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని తెలిపారు.

# పదవీ విరమణ ప్రతి ఒక్కరికి తప్పదు



**గద్వాల నడిగడ్డ,జులై 31 (జనం సాక్షి)**

పదవి విరమణ ప్రతి ఒక్కరికి తప్పదని గురువారము పూడూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండి సుభాన్ ను ఉద్దేశించి వక్తలు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని పూడూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎండి సుభాన్ పదవీ విరమణ సందర్భంగా రాజ్యము- ప్రజాస్వామ్యము అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కులను రాజ్యము కాలరాస్తుందని,రాష్ట్రము దేశంలో పేద, బడుగు, బలహీన, బక్కజిక్కిన ప్రజల వైపు ఉండాల్సిన రాజ్యము బలవంతుల వైపు ఉంటుందని హక్కులను హరిస్తున్న రాజ్యము ఎదిరించాలంటే ప్రతి పౌరుడు రాజ్యాన్ని నిలదీయాలని పౌర హక్కుల సంఘం చెప్తుందని అందుకు పేద బలహీన వర్గాల వైపు పౌర హక్కుల సంఘం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సుభాన్ కుటుంబ సభ్యులు, చిన్ననాటి మిత్రులు, వివిధ సంఘాల నాయకులు వారి నిర్దేశించి ప్రసంగించారు. అనంతరం సుభాన్, సతీమణి బీబీ లకు వారి బంధువులు,మిత్రులు, తదితరులు పూలమాలలు, శాలువలతో సత్కరించారు.

# గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్ట్

## - గంజాయి, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లు స్వాధీనం - చేర్యాల సీఐ ఎల్.శ్రీను

**చేర్యాల జులై 31 (జనంసాక్షి) :**
చేర్యాల పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయి విక్రయించడానికి ప్రయత్నం చేస్తున్న వ్యక్తులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సీఐ లక్కెపురం శ్రీను గురువారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చేర్యాల పట్టణానికి చెందిన నీలం చందు, ఆకుల హర్షవర్ధన్ అనే ఇద్దరు యువకులు పట్టణంలోని ఓ పెట్రోల్ పంపు ఆవరణలో ఉన్న చెట్ల పొదల్లో గంజాయి విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు చేర్యాల పోలీసులతోపాటు టాస్క్ ఫోర్స్ అధికారులు వెళ్లి పట్టుకుని విచారించగా హైదరాబాదులోని గుర్తు తెలియని వ్యక్తి నుండి కొనుగోలు చేసుకుని తెచ్చామని తెలిపినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద ఉన్న 180 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు చరవాణిలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి నిందితులను జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను, టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ హోటల్లు, కల్లు డిపోలు ఇతర ప్రదేశాలలో ఎవరైనా గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీస్ 100 నెంబర్, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు 8712667445 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎప్పటికప్పుడు గమనిస్తూ ఏం చేస్తున్నారో ఎక్కడికి వెళ్తున్నారో వారి కదలికలపై కన్నేసి ఉంచాలని తెలిపారు. గంజాయి విక్రయించిన వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఎస్సై వేముల నవీన్ కుమార్, టాస్క్ ఫోర్స్ అధికారులు, చేర్యాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# పేదవాడి కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**ఉప్పునుంతల జనం సాక్షి :**
పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో కొత్త రేషన్ కార్డులకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలంగాణ ప్రదేశ్ కమిటీ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కొత్త యశోద ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పదేళ్ల నుంచి ఎదురుచూస్తున్న పేదల ఆశలను నెరవేర్చిన ప్రభుత్వం కాంగ్రెస్ అని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలన్న సంకల్పంతో ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అందులో భాగంగానే ఉప్పునుంతల మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల ప్రజలకు నూతన రేషన్ కార్డుల ప్రొసీడింగ్స్ కాపీలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ప్రమీల, కట్ట అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ అడ్వకేట్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, మాజీ జడ్పిటిసి అనంత ప్రతాపరెడ్డి, అధికారులు, కార్యకర్తలు, రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు అంబేద్కర్

## - ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**శివ్వంపేట జూలై 31 జనంసాక్షి :**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరి వాడు, ఆదర్శప్రాయుడని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శివంపేట మండలం ఉసిరిక పల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం అలాగే యువకులు కలిసి ఏర్పాటుచేసిన అంబేద్కర్ నూతన విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ అంటే ఒక గొప్ప సంస్కర్త అనీ, సమన్వయం అంటే బీద, ధనిక కుల మతాలకు అతీతంగా సమాజం ఉండేటట్లు కృషిచేసిన కృషి వాలుడన్నారు. అందరికీ సమాన హక్కులు చదువులతోనే సమాజంలో మార్పులు వస్తాయని గ్రహించిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. దేశ విదేశాలలో మంచి విశ్వవిద్యాలలో విద్యను అభ్యసించి, నేటితరం విద్యార్థులకు యువకులకు ఆయన ఒక ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు నూతనంగా నిర్మించిన సచివాలయానికి అంబేద్కర్ సచివాలయం పేరు పెట్టడంతో పాటు 150 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సచివాలయం ఎదుట ఆవిష్కరించడం అదే మాదిరిగా ఆయన పేరుతో మ్యూజియంని కూడా ఏర్పాటు గర్వించదగ్గ విషయం, అద్వితీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జెడ్పిటిసి పబ్బా మహేశ్ గుప్తా,



జిల్లా పరిషత్ మాజీ కోషన్ సభ్యులు మన్సూర్ అహ్మద్, మాజీ వైస్ ఎంపీపీ సిల్వరి జ్యోతి ఆంజనేయులు, టిఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు తూము కృష్ణారావు, శ్రీనివాస్ గౌడ్, నాగేశ్వరరావు, నరేందర్, తాటి పవన్ గుప్తా, మాజీ సర్పంచ్ బాబురావు, అంబేద్కర్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిషన్, సంఘం మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ అజీజ్, జిల్లా అధ్యక్షులు ఎం. సుధాకర్, మండల అధ్యక్షులు నీరుడి కృష్ణ, నాయకులు ప్రభుదాస్, బాలరాజ్, బాబు, సంజీవులు గ్రామస్తులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించండి

## - మాజీ జెడ్పీ చైర్మెన్ లోకనాథ్ రెడ్డి



**వనపర్తి, జూలై 31 (జనంసాక్షి):** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓట్ల కోసం వస్తే హామీలపై ప్రశ్నించాలని స్థానిక జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ రాకాసి లోకనాథ్ రెడ్డి అన్నారు. బిజెపి వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వార్డు పర్యటనలలో భాగంగా గురువారం ఐదో వార్డు వశ్యానాయక్, ముందరి తండాలో బిజెపి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై వార్డు పర్యటన చేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి మాట్లాడారు. స్థానిక ప్రజలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు చేరి, క్రిమి, కీటకాలతో సీజనల్ వ్యాధితో బాధపడుతున్నారని,సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రవాణా వ్యవస్థ దుర్భరంగా ఉందని మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సరైన రోడ్డు వ్యవస్థను బాగు చేసి ప్రజలను ఇబ్బందుల నుండి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.సీతారాములు, అధికార ప్రతినిధి, జిల్లా మీడియా ఇన్చార్జి పెద్దిరాజు, అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గోపీనాథ్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగం సురేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సూగురు రాములు, నవీన్ కుమార్, రాయన్న సాగర్, యువమోర్చా పట్టణ అధ్యక్షులు రాజు,ఉందే కోటి అంజి, శ్రీకాంత్, చందు వార్డు నాయకులు పాల్గొన్నారు.

## బైకు-ఆటో ఢీ - ముగ్గురికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, జూలై 31,(జనం సాక్షి) :** బైకు-ఆటోను ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు అయినా సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నశంకరం పేటమండలం ఖాజాపూర్ గ్రామ శివారులో ట్రాలీ ఆటో ఖాజాపూర్ నుండి మెదక్ వెళ్లే క్రమంలో ఖాజాపూర్ శివారులో కూల్ డ్రింక్ బాటిల్స్‌తో వెళుతున్న ఆటో ట్రాలీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ముగ్గురు వ్యక్తులకు ఒకరికి కాలు విరుగగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒకరిని రామాయంపేట ఇద్దరినీ హైదరాబాద్ తరలించినట్లు స్థానికులు తెలిపారు.క్షతగాత్రులు ఖాజాపూర్ తాండాకు చెందిన లంబాడి రమేష్ విక్రమ్ సుధాకర్‌గా గుర్తించారు.

